ఈనాడు
జనగామ
శుక్రవారం అక్టోబరు 18, 2024


## ప్రమాదకరమైనా పట్టించుకోరేం?..



జనగామ-హుస్నాబాద్ రహదారిపై గానుగపహాడ్ వాగు వద్ద నిర్మించిన తాత్కాలిక దారి ప్రమాదకరంగా మారింది. గత నెల రోజుల కింద కురిసిన వర్షాలకు దారంతా కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి, తాత్కాలికంగా మరమ్మతు చేయించి రాకపోకలు పునరుద్ధరించారు. రెండు రోజుల కింద కురిసిన వర్షాలకు రోడ్డు పక్కన మట్టి కొట్టుకుపోతుండటంతో వాహనాలు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మధ్యలో ఆగిన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జనగామ రూరల్

## పిచ్చితీగల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన



**పాలకుర్తి, న్యూస్‌టుడే:** పాలకుర్తి నియోజకవర్గ కేంద్రం శివారులోని విద్యుత్తు సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న కరెంట్ వైర్లకు పిచ్చి చెటు అల్లుకుని ప్రమాదకరంగా మారాయని 'ఇదేందయ్యా ఇది..' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆ శాఖాధికారులు స్పందించారు. డీఈ రాంబాబు, ఏఈ రణధీర్ వెంటనే స్పందించి, సిబ్బందితో అల్లుకున్న తీగలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

# సర్కారు బడులకు మంచి రోజులు

### కొత్త ఉపాధ్యాయులతో బోధన బలోపేతం



బచ్చన్నపేట మండలం అడవికేశవాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

**జనగామ, న్యూస్‌టుడే:** పాఠశాల విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు, వాటి అమలుతో సర్కారు బడులకు మంచి రోజులు వచ్చాయంటున్నారు. బోధనలో విద్యా ప్రమాణాల పెంపునకు కీలక నిర్ణయాలు తీసుకుంటుండటంతో బోధన వ్యవస్థ బలోపేతం కానుంది. మండల నోడల్ వ్యవస్థ ఏర్పాటు, నోడల్ అధికారులకు మండల విద్యాధికారులుగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతల అప్పగింత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో గాడి తప్పిన వ్యవస్థను సరి చేసేందుకు ఖాళీల భర్తీ ప్రక్రియను రికార్డు స్థాయిలో పూర్తి చేయడం సత్ఫలితాలనివ్వనుందని చెబుతున్నారు.

**తాజా డీఎస్సీలో నియామకాలు ఇలా**

హిందీ-06, తెలుగు-12, పీఈటీ-7, స్కూల్ అసిస్టెంట్లు, గణితం-6, భౌతికశాస్త్రం-03, జీవశాస్త్రం-10, సాంఘిక-16, తెలుగు-04, హిందీ-02, ఆంగ్లం-05, ప్రత్యేక విద్య-03, పీడీ-1, ఎస్జీటీలు-114, ప్రత్యేక విద్య-8. మొత్తం-197.

**మండలాల వారీగా కేటాయింపు..**

బచ్చన్నపేట-32, చిల్పూరు-4, దేవరుప్పుల-40, స్టే.ఘన్‌పూర్-6, జనగామ-9, కొడకండ్ల-37, లింగాలగణపురం-9, నర్మెట్ట-18, పాలకుర్తి-13, రఘునాథపల్లి-9, తరిగొప్పుల-11, జఫర్‌గఢ్-9.

**ఉపాధ్యాయుల కొరత తీరింది..**

**బచ్చన్నపేట:** మండలంలోని బండనాగారంలో 100 మంది విద్యార్థులకు పైన ఉండగా, ముగ్గురు ఉపాధ్యాయులుండేవారు. వీరు పదోన్నతి పొందడంతో ఉపాధ్యాయులు ఉండని పరిస్థితి ఏర్పడింది. దీంతో తాజా నియామకాలు జరిగే దాకా వారిని రిలీవ్ చేయలేదు. ఇపుడు ఐదుగురిని నియమించి పంపించారు. పడమటి కేశవాపూర్ ఉన్నత పాఠశాలలో 222 మంది విద్యార్థులకు గాను కొత్తగా నలుగురిని, ప్రాథమిక పాఠశాలలో 89 మందికి ముగ్గురికి తోడు మరో ముగ్గురు చేరారు.

తాజా నియామకాలతో జిల్లాలో పాఠశాల విద్యావ్యవస్థ మరింత బలపడనుంది. మారుమూల తండా బడులలో ఉపాధ్యాయుల కొరత తీరుతోంది. విద్యా ప్రమాణాల సాధనకు ఇది ఎంతో తోడ్పడుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు-341, యూపీఎస్-64, ఉన్నత-103, మొత్తం : 508

**ఆ మండలాలకు కొత్త బలగం..**

జిల్లాలో 508 పాఠశాలలున్నాయి. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న కొడకండ్ల, దేవరుప్పుల, బచ్చన్నపేట మండలంలోని పలు మారుమూల గ్రామాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. తాజా నియామకాల్లో ఈ మూడు మండలాలకు ప్రాధాన్యమిచ్చారు.

**యువశక్తి పరవళ్లు తొక్కాలి..**

తాజా డీఎస్సీలో జిల్లాలో ఎస్జీటీలు 114, ఎస్జీటీ ప్రత్యేక-8, 75 మంది స్కూల్ అసిస్టెంట్లు నియమితులయ్యారు. వీరిలో 20 నుంచి 35 వయసు లోపు 136 మంది ఉండటం విశేషం. నూతనోత్సాహంతో వీరంతా పాఠశాల విద్యా వ్యవస్థకు కొత్త కళ తెస్తారని ఆశిస్తున్నారు. 197 మందిలో 96 మంది మహిళలుండటం మరో విశేషం.

**తగ్గిన విద్యార్థుల సంఖ్య**

**పాలకుర్తి:** పాలకుర్తి మండలంలోని శాతాపురం ప్రాథమిక పాఠశాలలో 24 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లుండగా పదోన్నతులపై బదిలీ అయ్యారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం పది మంది విద్యార్థులుండగా, ఒకరు డిప్యుటేషన్‌పై ఉండగా, తాజాగా వీణా, లావణ్య ఇద్దరు చేరారు. సంఖ్య పెంపునకు కృషి చేస్తామని వారు చెప్పారు.

# కిలోల్లో కొంటున్నారు టన్నుల్లో తరలిస్తున్నారు!

## జోరుగా రేషన్ బియ్యం దందా..

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, నర్సంపేట, కమలాపూర్, వరంగల్ క్రైం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దందా జోరుగా సాగుతోంది. పట్టణాలు, గ్రామాల్లోనే కాకుండా ఏజెన్సీ ప్రాంతాలకూ ఇది విస్తరించింది..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 11,11,401 కార్డుదారులకు ప్రతి నెలా 2,266 చౌకధరల దుకాణాల ద్వారా సుమారు 23 వేల టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో 2,250 టన్నులకుపైగా పక్కదారి పడుతోంది.



**ఎలా చేస్తారంటే..**

పేదల బియ్యంతో రూ.లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు, మిల్లర్లు.. పోలీసులకు చిక్కకుండా రకరకాల ఎత్తులు వేస్తున్నారు. రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుంచి సేకరించిన రాయితీ బియ్యాన్ని టన్నుల కొద్దీ నిల్వ చేస్తారు. అర్ధరాత్రి లారీల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తారు.



ఇది 30 టన్నుల రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ. ఇటీవల మహారాష్ట్ర వైపు వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.

టాస్క్‌ఫోర్స్

**1 రేషన్ దుకాణాల ద్వారా..**

లబ్ధిదారులు తమ కార్డును కోల్పోకుండా ఉండేందుకు ప్రతి నెలా చౌకధరల దుకాణం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్నట్లు వేలిముద్రలు వేసి వస్తున్నారు. దుకాణాదారుడు వారికి కిలోకు రూ.10 చొప్పున లెక్క కట్టి డబ్బులు ఇస్తున్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కొందరు డీలర్లు లబ్ధిదారులకు డబ్బులకు బదులు సబ్బులు, సర్ఫ్, గోధుమ పిండి, బోళ్ల సబ్బులు అందజేస్తున్నారు. అలా పోగైన బియ్యాన్ని మిల్లర్లకు రూ.14 నుంచి రూ.16 చొప్పున రాత్రి సమయంలో మిల్లులకు తరలిస్తున్నారు.

**2 సన్నబియ్యంగా మార్చి**

రేషన్ దుకాణాలతో పాటు ఇంటింటా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు తమ రైస్ మిల్లుల్లో సన్నబియ్యంగా మార్చుతున్నారు. అలా మరపట్టిన బియ్యాన్ని 25 కిలోల సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 మధ్య విక్రయిస్తున్నారు.

**3 నూకలుగా..**

పౌల్ట్రీఫారాలు, బీర్ల తయారీ కంపెనీల్లో నూకల వినియోగం పెరిగింది. దీంతో వాటికి డిమాండ్ అధికమైంది. దళారులు లబ్ధిదారుల నుంచి రూ.8 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లర్లకు రూ. 12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. నూకలుగా మరపట్టిన మిల్లర్లు కిలోకు రూ. 18 లేదా రూ.20 చొప్పున అవసరమున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ డివిజన్‌లో కొందరు అక్రమార్కులు సామర్థ్యం తక్కువ కలిగిన మిల్లులను స్థాపించుకుని బియ్యాన్ని నూకలుగా మరపడుతున్నారు.

**సీఎంఆర్ లక్ష్యం కోసం..**

వరంగల్ జిల్లా నల్లబెల్లి, దుగ్గొండి, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా గూడూరు, కేసముద్రం, మరిపెడ, హనుమకొండ జిల్లా కమలాపూర్ తదితర మండలాల్లోని మిల్లర్లే చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోలు సమయంలో వారికి కేటాయించిన ధాన్యాన్ని అధిక ధరలకు పక్కదారి పట్టిస్తున్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని భర్తీ చేసుకునేందుకు తక్కువ ధరకు లభించే పేదల బియ్యాన్ని టన్నుల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. వాటిని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద లెక్కలు చూపిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

**ఇదీ పరిస్థితి..**



హనుమకొండ జిల్లా పరకాలలోని శ్రవణ్‌కుమార్ బిన్ని రైస్‌మిల్లరు రాయితీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ పౌరసరఫరాలశాఖకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు మిల్లుపై దాడి చేశారు. అందులో రూ.12.81 లక్షల విలువ చేసే 325 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని, 187.5 క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు.

**మాఫియాలా బియ్యం డాన్‌లు**

ఉమ్మడి జిల్లాలో చౌక బియ్యం మాఫియా విస్తరిస్తోంది. జిల్లాకు ఇద్దరు నుంచి నలుగురు చొప్పున దందా చేస్తూ బియ్యం డాన్‌లుగా ఎదిగారు. యువత, మైనర్లు పావులుగా మారుతున్నారు. దళారులకు ద్విచక్రవాహనం, సంచులు, డిజిటల్ కాంటాలు అప్పగించి ఊళ్లలోకి పంపిస్తున్నారు. వారు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొంటారు. డిజిటల్ కాంటాలపై తూకాలు చేస్తున్నారు. బస్తా బరువు 50 కిలోలు కాగానే వాహనంపై తమ రహస్య ప్రదేశానికి తరలిస్తారు. ఇందుకోసం అక్రమార్కులు పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు.



వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలో లబ్ధిదారుల నుంచి అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి బస్తా 50 కిలోలు కాగానే స్కూటీపై తీసుకెళ్తున్న యువకులు

● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో ఒక వ్యక్తి చక్రం తిప్పుతున్నారు. పోలీసు, రెవెన్యూ, పౌరసఫరాలశాఖ అధికారులను మచ్చిక చేసుకొని ఆ ప్రాంతంలో దందాను కొనసాగించే ఇతరులను పట్టిస్తున్నారు. తాను మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు 15 నుంచి 20 క్వింటాళ్ల చొప్పున ప్రయాణికుల ఆటోల్లో నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు.

● హనుమకొండ జిల్లాలో బడా దళారీ అక్రమానికి అడ్డూ అదుపు లేదు. మండలాల వారీగా మధ్యదళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారు.


## జనగామ మైన్స్ ఏడీగా రాఘవరెడ్డి

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామ మైన్స్ ఏడీ విజయ్‌కుమార్‌ను గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్ బుధవారం సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే. మహబూబ్‌నగర్‌లో పని చేసిన సమయంలో ఎదుర్కొన్న ఆరోపణలపై ఆయను సస్పెండ్ చేశారు. కాగా జనగామ మైన్స్ ఏడీగా యాదాద్రి-భువనగిరి జిల్లా ఏడీగా పని చేస్తున్న రాఘవరెడ్డికి జనగామ అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# మస్తుగా తాగేశారు..!

### ● 14 రోజుల్లో రూ.142.79 కోట్ల మద్యం విక్రయాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో దసరా సందర్భంగా మద్యం విక్రయాలు రాష్ట్రంలోనే రికార్డును సాధించాయి. రాష్ట్రంలోనే అధిక పెరుగుదల నమోదైంది. వరంగల్ పట్టణ, రూరల్ పరిధిలో 49.88, జనగామ జిల్లాలో 89.87 శాతం విక్రయాలు పెరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 వైన్స్, 134 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. గతేడాది పండగ సందర్భంగా రూ.95.53 కోట్ల అమ్మకాలు జరిగితే.. ఈసారి అది 14 రోజుల్లోనే రూ.142.76 కోట్లకు చేరడం గమనార్హం. దాదాపు రూ.48.26 కోట్లు ఎక్కువగా జరిగాయి. ఈ నెల చివర్లో దీపావళి ఉండటంతో విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు. –వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే




**ఇవీ కారణాలు..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం విక్రయాలు ఎక్కువగా పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది గొలుసు దుకాణాలు. గ్రామగ్రామాన కిరాణ దుకాణాలు, ఇళ్లల్లోనూ విక్రయిస్తున్నారు. సమయపాలన పాటించకుండా అవి తెరిచే ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలు అది దొరుకుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు నగర శివారులో గొలుసు దుకాణాలు ఎక్కువగా ఉండడంతో వారు వైన్స్‌ల నుంచి మద్యం తీసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వరంగల్ నగరంలో ఎక్కువ విద్యా సంస్థలు ఉంటాయి. యువత ఎక్కువగా కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు, పిల్లలకు విక్రయించలేదని చెప్పారు.

## రైతులు దళారులను ఆశ్రయించొద్దు



దేవరుప్పుల: రామరాజుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**దేవరుప్పుల రూరల్, పాలకుర్తి, కొడకండ్ల, న్యూస్‌టుడే:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేటును ఆశ్రయించి మోసపోవద్దని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. గురువారం పాలకుర్తి మండల కేంద్రంలో, కొడకండ్ల మార్కెట్ యార్డు, దేవరుప్పుల మండలం రామరాజుపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు పాలకుర్తి రాజీవ్‌చౌరస్తాలో వ్యాపారులు, ప్రజలతో ఎమ్మెల్యే ముచ్చటించారు. రామరాజుపల్లికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కొమురయ్య, డీఆర్డీవో వసంత, డీపీవో రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు నల్ల శ్రీరాం, కుమారస్వామి, సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో, అత్యుత్తమ విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. కొడకండ్లలో పాఠశాల నిర్మాణానికై రెవెన్యూ అధికారులు నిర్ణయించిన 25 ఎకరాల స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం మత్స్యకారులతో కలిసి బయ్యన్న రిజర్వాయర్‌లో చేపపిల్లలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు కులవృత్తులకు పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు.

## విలువల జ్ఞాన ప్రదాత మహర్షి వాల్మీకి



కలెక్టరేట్‌లో జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న పాలనాధికారి రిజ్వాన్‌బాషా, ఇతర అధికారులు

**జనగామ, న్యూస్‌టుడే:** మానవీయ విలువలతో కూడిన గొప్ప జ్ఞానాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి వాల్మీకి గొప్ప జ్ఞానఖని అని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ ఆధ్వర్యంలో జిల్లా సచివాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి పాలనాధికారి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రామాయణం ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భం, ప్రతి చోట వాల్మీకి గుర్తుకు వస్తారన్నారు. సమాజ నడవడి ఎలా ఉండాలో దారి చూపిన మహా కావ్యం అని, మనం చేసే ప్రతి పని మానవతా దృక్పథంతో జోడింపబడాలన్నారు. కార్యక్రమంలో ఏవో మన్సూర్, వాల్మీకి, బోయ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు రాజు, గౌరవాధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు రాజు భూపతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పురపాలిక కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో మున్సిపల్ అధికారులు మధు, సురేందర్ పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

**జఫర్‌గఢ్, న్యూస్‌టుడే:** తిమ్మంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఐదుగురు బాలికలు సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దామెర షారోన్, పీడీ కొండ రవి తెలిపారు. జనగామలోని ప్రిస్టిన్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న బుల్లె స్పందన, పెండ్లి నిఖిత, లాకవత్ దీపిక, భూక్య రాణి, ఎనిమిదో తరగతి చదువుతున్న మాచర్ల రాణి ప్రతిభ చూపారన్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పాఠశాల అభివృద్ధి దాత చాడ ప్రవీణ్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు వారిని అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు





దుర్గామాతకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



అమ్మవారికి సమర్పించిన బోనాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్ దంపతులు

# ముగిసిన దుర్గామాత ఉత్సవాలు

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట మైదానంలోని దుర్గామాత దేవాలయ వార్షికోత్సవాలు గురువారం ముగిశాయి. నాలుగు రోజులుగా వివిధ కార్యక్రమాలతో పట్టణంలో జన సందడి నెలకొనగా, చివరి రోజు అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వన భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేసుకుని బంధుమిత్రులతో పండగ సంప్రదాయం, ఆచారాలను పంచుకున్నారు. డీసీపీ రాజమహేంద్రనాయక్, ఆయన సతీమణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ఆరాధ్యశర్మ ఆధ్వర్యంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు రాజేష్, చెన్నకేశవులు, శ్వేత తదితరులు బందోబస్తు చేపట్టారు.


# వానమ్మా.. వందనం!

## ముగిసిన నైరుతి.. మురిసిన ఓరుగల్లు

– న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

**ఉమ్మడి వరంగల్ జిల్లాకు వానాకాలం కలిసి వచ్చింది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. అన్నదాతలు అప్పుడే యాసంగి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జూన్‌లో మొదలైన నైరుతి సీజన్ సెప్టెంబరుతో ముగిసినా అక్టోబరు రెండో వారం వరకు అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.**

జిల్లాల్లో అధికంగా నమోదైన వర్షపాతం (శాతం)




మండలాలవారీగా అధిక వర్షపాతం శాతం

| | |
|---|---|
| **మహబూబాబాద్** | |
| చిన్న గూడూరు | 117 |
| మరిపెడ | 100 |
| నర్సింహులపేట | 96 |
| నెల్లికుదురు | 60 |
| దంతాలపల్లి | 57 |
| మహబూబాబాద్ | 44 |
| కురవి | 42 |
| **ములుగు** | |
| ఏటూరునాగారం | 101 |
| మంగపేట | 47 |
| వెంకటాపురం | 40 |
| తాడ్వాయి | 37 |
| గోవిందరావుపేట | 36 |
| **జనగామ** | |
| కొడకండ్ల | 50 |
| జనగామ | 24 |
| **భూపాలపల్లి** | |
| మల్హార్‌రావు | 30 |
| కాటారం | 28 |
| రేగొండ | 23 |
| మహదేవ్‌పూర్ | 23 |
| **వరంగల్** | |
| దుగ్గొండి | 42 |
| వర్ధన్నపేట | 41 |
| పర్వతగిరి | 34 |
| **హనుమకొండ** | |
| భీమదేవరపల్లి | 34 |
| ధర్మసాగర్ | 28 |
| ఎల్కతుర్తి | 24 |

### సాగుబడికి చెరువుల నీరు

ఇది హసన్‌పర్తి మండలం నాగారం చెరువు. ఉమ్మడి జిల్లాలో 3,900 చెరువులు, కుంటలున్నాయి. ఈసారి 65 శాతం పూర్తి స్థాయిలో నిండాయి. మిగతావాటిలో 50 నుంచి 75 శాతం వరకు నీరు చేరింది. వీటికింద 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



**జిల్లాల వారీగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షపాతం (మి.మీ.)**

| జిల్లా | సాధారణం | నమోదైంది |
|---|---|---|
| ములుగు | 1200 | 1603.8 |
| మహబూబాబాద్ | 878.0 | 1280.5 |
| జయశంకర్ | 985.8 | 1159.8 |
| వరంగల్ | 901.0 | 1082.5 |
| హనుమకొండ | 875.7 | 981.5 |
| జనగామ | 755.2 | 829.2 |

### పంటలకు మేలు

**- తోకల ఆదిరెడ్డి, రైతు, సీతంపేట, హసన్‌పర్తి**



ఈసారి సకాలంలో వర్షాలు పడ్డాయి. యాసంగిలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. చెరువులతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వరి పంటకు నీరందించే అవకాశం ఉన్నందున యాసంగి సాగుపై ఆశలు పెంచుకున్నాం.

### సాగు విస్తీర్ణం పెరుగుతుంది

**- రవీంద్రసింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఆశించిన మేరకు వర్షాలు కురిశాయి. దీంతో జలశయాల్లోకి వరదనీరు చేరింది. నీరు లేని చెరువుల్లోకి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నింపుతారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుంది.



పంటలకు నీరు అందిస్తున్న రైతు




ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో నిండుగా వ్యవసాయ బావి

# రైతులకు మద్దతుగా పత్తి కొనుగోళ్లు!

**ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధంగా ఉంది.. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం అని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ తెలిపారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, మద్దతు ధరపై అవగాహన, ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం 'ఈనాడు' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు జేడీఎం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.**

–ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ఈనాడు ఫోన్ ఇన్

**మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్**

? పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకొస్తే.. సీసీఐ కొనుగోలుచేస్తుందా?
**- యాకూబ్, కొత్తూరు, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లా**

✔ రైతులు పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకురావొద్దు. విడి పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ప్లాస్టిక్, గన్నీ సంచుల్లో తీసుకురావడం వల్ల ఆ బస్తాల్లోని పోగులు పత్తిలో కలిసిపోయి నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. స్పిన్నింగ్ చేసే సమయంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయి.

? ఈ ఏడాది అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. కొంతమేర మచ్చ వచ్చి రంగు మారింది. పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం ఎక్కువగా ఉంది. ఇలాంటి పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందా? **- (శ్రీనివాస్, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా), (శివశంకర్, ఆత్మకూరు, హనుమకొండ జిల్లా), (సతీశ్, వెన్నారం, డోర్నకల్), (అన్నా తిరుపతి, ములుగు జిల్లా), (వెంకటేశ్వర్, డోర్నకల్), (తోట రాజేందర్, అబ్బాపూర్, ములుగుజిల్లా)**

✔ నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉంటేనే కనీస మద్దతు ధర రూ.7,521కు సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమశాతం సడలింపు, నాణ్యత లేకున్నా కొనుగోలు చేసే అవకాశం లేదు. రైతులు మొత్తం వచ్చిన దిగుబడిలో మంచి పత్తిని, నాణ్యత లేనిది వేరు చేయాలి. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందొచ్చు. మిగిలినది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవచ్చు. ఉదయం కాకుండా మధ్యాహ్నం పత్తిని ఏరడం ద్వారా తేమశాతాన్ని తగ్గించొచ్చు.



? దళారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తూ.. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
**- బి.సాంబయ్య, నల్లబెల్లి, వరంగల్ జిల్లా**

✔ ఆరుగాలం పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దు. దగ్గరలోని మార్కెట్ కమిటీల్లో.. సీసీఐ నోటిఫై చేసిన మిల్లుల్లో పత్తిని అమ్మడం ద్వారా మార్కెటింగ్‌శాఖ రైతుల సరకుకు జవాబుదారీగా ఉంటుంది. గిట్టుబాటు ధరతో పాటు నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లిస్తుంది. తరుగు పేరుతో దళారులు చేసే మోసాలకు మార్కెటింగ్‌శాఖ బాధ్యత వహించదు.

? పత్తి రైతుల కోసం మార్కెటింగ్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సప్ నెంబరులో రైతు వ్యక్తిగత చరవాణి నెంబరు నమోదుచేసినా పండించిన పంట వివరాలు రావడం లేదు?
**- రమేశ్, దేవరుప్పుల, జనగామ జిల్లా**

✔ ఎన్ఐసీ ఇచ్చిన డేటా ఆధారంగా మార్కెటింగ్‌శాఖ పంట నమోదుచేసిన 21,65,326 మంది రైతులతో వాట్సాప్ నెంబరు (88972 81111)ను రూపొందించింది. ఈ నెంబరు సహాయంతో రైతులు సాగుచేసిన పత్తి వివరాలు, ఎన్ని క్వింటాళ్ల వరకు సీసీఐకు విక్రయించేందుకు అవకాశముంది.. తదితర వివరాలను ముందస్తుగా తెలుసుకోవచ్చు. ఇందులో రైతు వివరాలు రానంత మాత్రాన సీసీఐకు పంట విక్రయించవద్దనే నిబంధన లేదు.

? ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి దాన్ని సీసీఐకి విక్రయిస్తూ.. లబ్ధి పొందుతున్నారు. ఈసారి మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులను నియంత్రిస్తారా? **- (మహేశ్ హాజంపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా), (శ్రీనివాస్, ఖిలాషాపూర్, జనగాం జిల్లా)**

✔ ఈ ఏడాది నోటిఫై చేసిన మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహిస్తే. . సంబంధిత మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటాం. సీసీఐ కాకుండా ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గుర్తిస్తే.. మిల్లుల్లో సమస్యలపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నెంబర్ల ద్వారా సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

? ప్రైవేటు వేబ్రిడ్జిలకు, మిల్లుల్లోని వేబ్రిడ్జిలకు ఒక్కోసారి తూకాల్లో తేడాలు వస్తున్నాయి. దాంతో రైతులు నష్టపోతున్నారు. తూకాల్లో మోసాలను ఎలా అరికడతారు?
**- బుస్సారి లక్ష్మణ్, కంచరపల్లి, రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా**

✔ మిల్లుల్లో పంట ఉత్పత్తుల తూకాల్లో ఉద్దేశపూర్వకంగా మోసాలకు పాల్పడితే సంబంధించిన వారిపై చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు అధికారులతో వేబ్రిడ్జిల తనిఖీలు నిర్వహిస్తానే. తూకాల్లో తేడాలొచ్చినట్లు అనుమానం వస్తే.. రైతులు.. తూనికలు, కొలతలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

**తూనికలు, కొలతలు అధికారుల నెంబర్లు**

జనగామ - 9440575081

హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లా - 9963311956

వరంగల్ - 9885558028

మహబూబాబాద్ - 9177661663

? వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పండించిన పంట విస్తీర్ణం కన్నా.. తక్కువ నమోదు చేస్తే. . ఏంచేయాలి? **- రవీందర్, తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా**

✔ వ్యవసాయ అధికారులు నమోదు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగానే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం.. ఆధార్ నెంబరు ప్రామాణికీకరణ, రైతు వేలిముద్రలు, ఓటీపీ ద్వారా ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసే అవకాశముంది. ఒకవేళ వ్యవసాయ విస్తరణాధికారులు సాగు విస్తీర్ణాన్ని తక్కువగా నమోదు చేస్తే.. ఆ రైతులు సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించిన పత్రాన్ని సీసీఐ అధికారులకు సమర్పించాలి.

## 19 నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

**సుబేదారి, న్యూస్‌టుడే:** హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. గురువారం కళాశాలలో వివరాలు వెల్లడించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 800 మంది హాజరవుతారన్నారు. బ్యాడ్మింటన్‌లో 12, హ్యాండ్‌బాల్‌లో 14, కబడ్డీ 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీములు పాల్గొంటాయన్నారు. ప్రారంభం రోజు నుంచి పోటీలు ముగిసే వరకు మైదానంలో వాకర్స్‌కు అనుమతి లేదన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్, పీడీ భాస్కర్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

**చికెన్ ధరలు**

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

| | |
|---|---|
| ఫాం: | 120 |
| రిటైల్: | 142 |
| డ్రెస్డ్: | 206 |
| స్కిన్‌లెస్: | 234 |



## ఇసుక దందాపై స్పందించిన కేటీఆర్



**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారంపై ఈ నెల 14 'ఇసుక దందా.. వారికి మామూలే' శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనానికి మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని జత పరుస్తూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం అంటూ పోస్టు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఇసుక మాఫియాకు అభయ హస్తం అంటూ వాగ్బాణాలు సంధించారు.

ఈనాడు కథనానికి స్పందన

# ఆర్టీసీ బస్సులు రైట్.. రైట్..



హనుమకొండలోని నయీంనగర్ కొత్త వంతెన మీదుగా ఆర్టీసీ బస్సులు పరుగులు ప్రారంభించాయి. వంతెన నిర్మాణం పనులు పూర్తై, ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నా.. ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని, ఇతర రూట్లలో తిరగడంతో సమయం వృథా కావడంతో పాటు ప్రయాణికులకు టికెట్‌పై అదనపు భారం తప్పడం లేదంటూ 'ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర వార్తకు ఆర్టీసీ, పోలీసు అధికారులు స్పందించారు. వంతెన మీదుగా బస్సులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్సులను ఈ మార్గంలో పంపించారు. దీంతో కరీంనగర్, హుజూరాబాద్, నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం ముందుగా బయలు బస్సులకు అదనపు చార్జి రూ.10 వసూలు చేశారని, తరవాత బస్సులకు అదనపు చార్జి తొలగించామని చెప్పారు. **– న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా**

## ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా విద్యార్థులు, యువతి, యువకులకు జిల్లా, రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా ఈ మధ్య తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివితో తీసిన షార్ట్‌ఫిలిం పెన్‌డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22లోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పీఆర్‌వోకు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు పెంచే అంశాలకు సంబంధించి గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు తీసిన ఫొటోలు, షాట్‌ఫిలిం వీడియోలను మాత్రమే పంపించాలన్నారు. పూర్తి వివరాలకు పీఆర్‌వో సెల్ 87126-85050 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

**వనదేవతల కటాక్షం..**

# మహా జాతర శాశ్వత పనులకు శ్రీకారం!

**మేడారం మహాజాతర పనులు ఎప్పుడూ సమయానికి పూర్తి కావు.. జాతరకు ఐదారు నెలల ముందు సమావేశాలు నిర్వహించడం, రెండు నెలల ముందే నిధులు మంజూరు చేయడం, హడావుడిగా పనులు చేపట్టడం జరుగుతుండేది. ఈ ఆనవాయితీకి స్వస్తి పలికేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. జాతరతో సంబంధం లేకుండా మేడారంలో చేపట్టాల్సిన శాశ్వత పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.** –తాడ్వాయి, న్యూస్‌టుడే(ములుగు జిల్లా)



### మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి

మేడారం మహాజాతర 2026 ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉంది.. అంటే మరో ఏడాదిన్నర ఉంది.. గత అనుభవాల దృష్ట్యా మహాజాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క ఇప్పుడే ప్రత్యేక దృష్టిసారించారు. గత మే నెలలోనే జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించి మేడారం అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏయే పనులు ఎప్పుడు చేయాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 4న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

### కార్యాచరణ ప్రారంభించిన కలెక్టర్

కలెక్టర్ టీఎస్.దివాకర ఇప్పటికే రెండుసార్లు జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన పనులను గుర్తించడం, గత జాతరలో ఎదుర్కొన్న ఇబ్బందులపై పూర్తిస్థాయిలో వివిధ శాఖలను అడిగి తెలుసుకొన్నారు. గత జులై 11న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

### రూ.17.25 కోట్లు మంజూరు

గతంలో జాతర నిర్వహణకు కొద్దిరోజుల ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండేది. దీంతో అవి పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యేవి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈసారి అధికారులు ముందుగానే మేల్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పంపించిన రూ.17.25 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### ప్రతిపాదనలు.. మంజూరైన నిధులు (రూ.కోట్లలో)

- సీఆర్ఆర్ పథకం ద్వారా కాల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 8
- మేడారంలోని శివరాంసాగర్ చెరువు నుంచి రిజర్వ్ ఫారెస్టు వరకు రోడ్డు విస్తరణ: 2.75
- ఎమ్మార్ పథకంలో నార్లాపురం చెక్‌పోస్టు నుంచి కాల్వపల్లి వరకు తారు దారి: 2.50
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 2
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు దారి: 2

వీటిలో కొన్ని టెండరు పూర్తయ్యాయి.. త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్‌రావు తెలిపారు.

### అతిథిగృహాల నిర్మాణానికి..



80 శాతం పూర్తయిన పూజారుల అతిథిగృహం

శాశ్వత ఏర్పాట్లే లక్ష్యంగా దేవాదాయశాఖ రూ.3.50 కోట్లతో అతిథిగృహాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పూజారుల అతిథి గృహం 80 శాతం పూర్తయింది. భక్తులు, అతిథుల కోసం అతిథి గృహం నిర్మించేందుకు ప్రభుత్వం మరో రూ.2 కోట్లు మంజూరు చేసింది. రెండు రోజుల కిందట అధికారులు స్థల పరిశీలన చేశారు. దేవాదాయ శాఖ నిర్మాణాలు మరో ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు.

### 19న జాతర పనులకు శంకుస్థాపన

రూ.7.35 కోట్లతో రెండు ప్యాకేజీలుగా చేపట్టే నార్లాపురం చెక్‌పోస్టు-కాల్వపల్లి, ఊరట్టం అమరవీరుల స్తూపం-ఊరట్టం, కన్నెపల్లి ఆర్చిగేటు-సారలమ్మ గుడి, మేడారం ఆర్అండ్‌బీ రోడ్డు-శివరాంసాగర్ చెరువు వరకు రహదారుల నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయింది. మంత్రి సీతక్క ఈ పనులకు 19న శంకుస్థాపన చేయనున్నారు.

## రహదారిపై గుంతలు.. అడుగడుగునా గండాలు



రఘునాథపల్లి, వెల్ది గ్రామాల మధ్య శిథిలమైన బీటీ రోడ్డు



ప్రాణాంతకంగా మారిన లోతైన గుంతలు

మండలకేంద్రం నుంచి వెళ్లి, అశ్వరావుపల్లి వైపు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. రద్దీగా ఉండే రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షం నీరు చేరడంతో వాహనచోదకులు తరచూ గుంతల్లో పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. ఆర్టీసీ, ప్రైవేట్ పాఠశాలల బస్సులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రెండు వరుసల రహదారిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు. - న్యూస్‌టుడే, రఘునాథపల్లి

## పూర్ణాహుతితో ముగిసిన శరన్నవరాత్రులు



**కొడకండ్ల, న్యూస్‌టుడే:** శ్రీయంగా పక్షం రోజులు నిర్వహించిన కొడకండ్ల రాజరాజేశ్వరీ దేవస్థానం శరన్నవరాత్రులు గురువారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. రాజరాజేశ్వరీ దేవస్థానంలో గత 75 ఏళ్లుగా దివంగత ప్రముఖ వేదపండితుడు నరసింహా రామయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో పక్షం రోజులు నిర్వహించే దేవీ నవరాత్రులు పాడ్యమి మొదలుకొని పౌర్ణమి వరకు నిత్యహోమాలతో, కుంకుమ పూజలతో ప్రత్యేకంగా నిర్వహిస్తారు. వేదపండితులు తాటిపాముల నర్సింహమూర్తి, గౌతమ్ శర్మ, జగన్నాథ్ శర్మ, రామమూర్తి శర్మ ఆధ్వర్యంలో గురువారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల భక్తులు, భవానీ దీక్షా స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



## సందె పొద్దులో.. అందాల విందు

జనగామలో పగలంతా ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు సాయంత్రం నీలి మేఘాలతో చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. నల్లమబ్బులు ఆకాశాన్ని కమ్మేయడంతో అందాలు పరుచుకున్నాయి. బస్టాండ్ నుంచి ప్రధాన రహదారి విభాగినిలో వీధి దీపాలు.. ఆకాశంలో తారల్లా మెరిసిపోయాయి. సూర్యాస్తమయం, నల్లమబ్బులు కలగలిసి వింత శోభ ఏర్పడగా, ప్రకృతి ప్రేమికులు సెల్ఫీలు, సెల్‌ఫోన్ చిత్రాలు తీసుకుని మురిసిపోయారు. – న్యూస్‌టుడే, జనగామ

## మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ రూరల్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

**తరిగొప్పుల, న్యూస్‌టుడే:** మండలంలోని సోలిపురంలో ప్రధాన రహదారి పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, దోమలు వ్యాపిస్తున్నాయి. - స్థానికులు

**సమాధానం:** రెండు రోజుల్లో తొలగిస్తాం. - లింగం, పంచాయతీ కార్యదర్శి

### పైపు లైన్‌కు మరమ్మతు



**రఘునాథపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని మల్లంపల్లి చర్చి సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ చెట్ల వేర్లు అడ్డు రావడంతో అపరిశుభ్ర నీరు సరఫరా అవుతుందని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగాకు' వివరించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రాధిక దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె వెంటనే స్పందించి మరమ్మతు చేయించి, పరిష్కరించారు.

స్పందనకు వందనం

# పత్తి రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి



మద్దతు ధరతో పత్తి క్రయ, విక్రయాలు, వాట్సప్ ప్రత్యేక సేవల ప్రచార పత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

**జనగామ, న్యూస్‌టుడే:** జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను నేటి నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై గురువారం జిల్లా సచివాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి పాలనాధికారి రిజ్వాన్‌బాషా మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం ప్రత్యేక వాట్సప్ 'బాట్'ను అందుబాటులోకి తెచ్చామన్నారు. 8897281111 నెంబరు ద్వారా ప్రత్యేక సమాచార సేవలను రైతులు పొందవచ్చునన్నారు. జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, సుమారు 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే అంచనా ఉందన్నారు. మార్కెటింగ్, అగ్నిమాపక, తూనికలు కొలతల శాఖలు తమ పరిధిలో ఏర్పాట్లు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, వ్యవసాయ అధికారి రామారావునాయక్, విద్యుత్తు ఎస్ఈ వేణుమాధవ్, జిల్లా రవాణాధికారి ఎంఎ ఖలీల్, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

### పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

**జనగామ:** రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన పాలనా పరమైన అంశాలపై గురువారం జిల్లా సచివాలయంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, తహసీల్దార్లతో కలెక్టర్ రిజ్వాన్ బాషా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మీ సేవ ద్వారా వచ్చే వివిధ దరఖాస్తులు, ధరణి పెండింగు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి నెల మొదటి వారంలోపు రేషన్ దుకాణాల తనిఖీ పూర్తి చేయలన్నారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి పోలీసు విభాగంతో సమన్వయం కుదుర్చుకోవాలని, గ్రామ సభల ద్వారా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. సమావేశంలో జనగామ ఆర్డీవో కొమురయ్య, ఏవో మన్సూరి, తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం..

**జనగామ:** మండల స్థాయిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం కావాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. జిల్లా సచివాలయంలో గురువారం ఈ అంశంపై అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి సమీక్ష జరిపారు. స్థలాల క్రమబద్ధీకరణలో మార్గదర్శక సూత్రాలను అనుసరించి త్వరగా పరిష్కరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ పురోగతిపై జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నీటిపారుదల శాఖ అధికారులు, మండలానికి నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళికను అనుసరించి ఎప్పటికప్పుడు పురోగతి వివరాలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీ సీఈవోగా మాధురి షా



బాధ్యతలు స్వీకరించి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాధురిషా, చిత్రంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

**జనగామ, న్యూస్‌టుడే:** జనగామ జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి(సీఈవో)గా మాధురి షా నియమితులయ్యారు. జడ్పీ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆమె ఆ తర్వాత జిల్లా సచివాలయంలో కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. గుజరాత్ రాష్ట్ర సచివాలయ సర్వీసు 2018 బ్యాచ్‌కు చెందిన ఆమె తెలంగాణకు డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మర్ పింకేశ్‌కుమార్ సతీమణి. దంపతులు ఇరువురు జిల్లాలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులుగా సేవలందించే అవకాశం రావడం విశేషంగా పేర్కొంటున్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



**దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే:** కొడకండ్ల ఏఎంసీ డైరెక్టర్ బోనగిరి యాకస్వామి తండ్రి చంద్రయ్య మృతిచెందడంతో, బాధిత కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మండలంలోని కోలుకొండలో జరిగిన కార్యక్రమంలో చంద్రయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బస్వ మల్లేశం, చింత రవి, కోతి ప్రవీణ్, అలకుంట్ల యాదగిరి, కుతాటి నరసింహులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కన్నెబోయినగూడెంలో కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

**నర్మెట్ట, న్యూస్‌టుడే:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని పీఏసీఎస్ ఛైర్మన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నర్మెట్ట, కన్నెబోయినగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. తాను ఛైర్మన్‌గా పదవి చేపట్టినప్పటి నుంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని తెలిపారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, జిల్లా సహాయకార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కుమారస్వామి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణాలపై అప్రమత్తత తప్పనిసరి

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** మండలంలోని మల్లంపల్లి, దర్దేపల్లి శివారులో ఆటోల్లో వెళ్తున్న ప్రయాణికులు, మహిళా కూలీలకు సీఐ మహేందర్‌రెడ్డి గురువారం పలు సూచనలు చేశారు. ప్రయాణాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అధిక లోడుతో వెళ్లొద్దని సూచించారు. జాగ్రత్తలు పాటించాలని డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రసన్నకుమార్, లింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 'క్లబ్'కు నగదు అందజేత

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామలో వనిత క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ వాసవి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవి చంద్రన్ క్లబ్‌కు రూ.10వేల నగదు పారితోషికాన్ని అందించారని వనిత క్లబ్ అధ్యక్షురాలు వరూధిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో నగదు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ప్రమోద్‌కుమార్, సంతోష్‌కుమార్, రవీందర్, అనుజ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'అవకాశవాద రాజకీయాలు సరికాదు'

**రఘునాథపల్లి, న్యూస్‌టుడే:** పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతూ అవకాశవాద రాజకీయాలు చేస్తున్న స్టే.ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య నేటి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి రాపోలు రామ్మూర్తి అన్నారు. మండలంలోని కంచనపల్లిలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియంను విమర్శిస్తే ప్రజా క్షేత్రంలో తగిన గుణపాఠం తగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మ విజయ మేరి, మనోహర్, జోజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామ పట్టణ శివారులోని బైపాస్ రహదారిపై ఉన్న పలు ప్రమాదకారక జంక్షన్ల వద్ద నివారణ చర్యలను తీసుకోవడానికి హైవే అథారిటీ అధికారులు కృషి చేయాలని డీసీపీ రాజమహేంద్రనాయక్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎన్‌హెచ్ అధికారులు, ఎల్అండ్‌టీ సిబ్బందితో కలిసి డీసీపీ రాజమహేంద్రనాయక్.. పెంబర్తి, యశ్వంతాపూర్ యూటర్న్‌ల వద్ద గురువారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించి లైటింగ్ ఏర్పాట్లు, ఇతర జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ దామోదర్‌రెడ్డి, రఘునాథపల్లి ఎస్సై నరేశ్, నేషనల్ హైవే కన్సల్టెంట్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి



వల్మిడిలో..

**పాలకుర్తి, న్యూస్‌టుడే:** దక్షిణ అయోధ్యగా పిలువబడే జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడిలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం నిర్వహించారు. స్థానికులు, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలేసి సేవలను కొనియాడారు. గ్రామ చరిత్రపై పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్థులు కుమార్, చంద్రయ్య, వెంకటయ్య, రాములు, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**తరిగొప్పుల, న్యూస్‌టుడే:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తరిగొప్పుల పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. చిల్పూరు మండలం లింగంపల్లికి చెందిన పలువురు వ్యక్తులు అక్రమంగా అబ్దుల్‌నాగారానికి ఇసుక తరలిస్తుండగా ఆ గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. వాహనాల యజమానులు మోటే శ్రీనివాస్, మేకల రాజు, డ్రైవర్లు గుణేల విష్ణువర్ధన్, మాలోత్ సందీప్‌లపై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## నూతన ఉపాధ్యాయులకు స్వాగతం



**బచ్చన్నపేట, న్యూస్‌టుడే:** పాఠశాల దశలో విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని మండలంలోని బండనాగారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇజ్జగిరి సిద్దయ్య అన్నారు. గురువారం బడిలో నూతనంగా చేరిన ఉపాధ్యాయులు డి.హేమరాణి, సంపత్‌కుమార్, శ్వేత, వసంతిలకు విద్యార్థులు శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా శశి

**జనగామ టౌన్, న్యూస్‌టుడే:** జనగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా జి.శశి నియామకమయ్యారు. వరంగల్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న జి.శశి పదోన్నతిపై జనగామకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా రానున్నారు. ఈ మేరకు గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## ఆంగ్ల ఉపాధ్యాయ పోస్టుకు ఆహ్వానం

**లింగాలఘనపురం, న్యూస్‌టుడే:** లింగాలఘనపురం ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జి.సునీత గురువారం ఒక ప్రకటనలో కోరారు. తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19న ఉదయం 10 గంటల వరకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

## స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

### పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మహిళా నేతలు



**స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే:** పీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకురాళ్లు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీకి సంబంధించి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో మౌనిక, రజిని, జ్యోత్స్న, యామిని, శోభ, రమ, సుప్రియ, ప్రశాంతి, కొమురమ్మ తదితరులు ఉన్నారు.

### స్వామివారి ఆశీస్సులతో మార్కెట్ అభివృద్ధికి కృషి



స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న మార్కెట్ ఛైర్‌పర్సన్ లావణ్య, చిత్రంలో డైరెక్టర్లు, నాయకులు

**చిల్పూర్, న్యూస్‌టుడే:** చిల్పూర్‌గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య అన్నారు. వెంకటేశ్వర స్వామిని గురువారం ఆమె డైరెక్టర్లతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు మెరుగైన సేవలందిస్తూ.. అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేష్, డైరెక్టర్లు పేరాల సుధాకర్, మాదిరెడ్డి యశ్వంత్, నాయకులు శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అపరిచితులపట్ల అప్రమత్తంగా ఉండాలి



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్ రెడ్డి, చిత్రంలో ఎస్సై నరేశ్, తదితరులు

**రఘునాథపల్లి, న్యూస్‌టుడే:** బ్యాంకుల వద్ద దొంగలు ఖాతాదారుల దృష్టిని మళ్లించి డబ్బును దోచుకువెళ్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ వద్ద ఖాతాదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎవరైనా అనుమానాస్పదంగా భావిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్సై డి.నరేశ్, ఎస్‌బీఐ మేనేజర్ మైనా, సిబ్బంది పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడికి సన్మానం



**లింగాలఘనపురం, న్యూస్‌టుడే:** జనగామ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొల్లూరి నర్సింహులును ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ, వాసవిక్లబ్ మండల కమిటీ ప్రతినిధులు గురువారం ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు దారం అశోక్, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, కోశాధికారి మెతుకు అనంతరాములు, తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

### మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



మృతుడు దర్గయ్య

**జఫర్‌గఢ్, న్యూస్‌టుడే:** మద్యానికి బానిసైన భర్తను భార్య మందలించడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై బానోతు రామ్‌చరణ్, గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని షాపల్లికి చెందిన ఉప్పునూతల దర్గయ్య(45) గత కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం పంట రుణం డబ్బులతో తాగాడని భార్య సునీత మందలించడంతో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం దర్గయ్య తన వ్యవసాయ క్షేత్రం వద్ద పురుగుల మందు తాగి విషయాన్ని ఒకరికి చరవాణిలో తెలిపాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంఘటన స్థలానికి వెళ్లి, హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని తెలిపారు. పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలున్నారు.

### కష్టపడిన వారికే పదవులివ్వాలి..

**స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కష్టపడి పార్టీ జెండా మోసిన వారికే పదవులు ఇవ్వాలని ఆ పార్టీ మహిళా మండల కార్యదర్శి నారగోని పద్మ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆమె మహిళా నాయకురాళ్లతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మొదటి నుంచి పార్టీలో కష్టపడిన వారిని వదిలేసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ సభ్యత్వం లేని వారికి నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. 15 ఏళ్లుగా తాను పార్టీ జెండాను మోసి మార్కెట్ కమిటీలో డైరెక్టర్‌గా ఆశపడిన తనకు చోటు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకురాలు నారగోని సరిత, సుమలత, రాణి, కనకలక్ష్మి, లావణ్య, ఎల్లమ్మ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### విగ్రహావిష్కరణకు భూమి పూజ..

**చిల్పూర్, న్యూస్‌టుడే:** రాజవరం గ్రామానికి చెందిన జడ్పీ మాజీ ఛైర్మన్ శ్రీశే పాగాల సంపత్ రెడ్డి విగ్రహావిష్కరణకు సంబంధించి గురువారం భూమి పూజ చేశారు. గ్రామానికి సంపత్ రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయన కుమార్తె సంజన రెడ్డి, నాయకులు యాదగిరి, వెంకట్ రెడ్డి, సూర్యనారాయణ, శ్రీను, యాకుబ్ పాషా, రాజేష్, రవి, కరుణాకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### జఫర్‌గఢ్ ఏవోగా కరుణాకర్‌రెడ్డి



**జఫర్‌గఢ్, న్యూస్‌టుడే:** జఫర్‌గఢ్ మండల వ్యవసాయాధికారిగా కరుణాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన వ్యవసాయాధికారి దీప్తి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారుల పోస్టులను భర్తీ చేయగా నూతనంగా ఎంపికైన కరుణాకర్‌రెడ్డికి తొలి పోస్టింగ్‌ను ఈ మండలానికి కేటాయించారు.

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి ప్రచారం

**జఫర్‌గఢ్, న్యూస్‌టుడే:** నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓట్లు వేయాలని మండలంలో పీఆర్‌టీయూ నాయకులు ప్రచారం చేపట్టారు. ఉప్పుగల్లు, కూనూర్, జఫర్‌గఢ్, తిమ్మంపేట పాఠశాలలో సంఘం నేతలు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రామారావు, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల చేయూత

**రఘునాథపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని ఖిలాషాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బడికి రూ.16వేల విలువైన క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీందర్ మాట్లాడుతూ.. మూలాలను మరిచిపోకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుప్పాల వేణు, డి.రాజశేఖర్, బండి శంకర్, జక్కుల శివ, యాకూబ్ పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి



తమ్మడపల్లి(జి)లో గేదెకు టీకా వేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రాధాకిషన్

**జఫర్‌గఢ్, న్యూస్‌టుడే:** పశువులు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సంచాలకుడు వై.రాధాకిషన్ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి(జి)లో గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాన్ని గురువారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా పెంపకందారులు, రైతులు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయ సంచాలకుడు సారంగం, మండల పశు వైద్యాధికారి రజిత, సహాయకురాలు మంజుల, గోపాలమిత్రలు రాజు, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.